కవితా కౌముది

# చాలనంత గోల

ఎస్.ఆర్.బందా

అన్నీ వున్నాయి..
తీరుతెన్నులన్నీ కలగలిసిన గంపలోనే
తెల్లవారుతున్నాం..

గడ్డపెరుగూ పటికబెల్లం పాలకోవా చక్రకేళీ
ఉప్పుకల్లూ వేపకాయా నిమ్మచుక్కా వగరుముక్కా
సగం దుఃఖం సగం వెన్నెలా పావు స్వేదం పావు మోదంలో
ముంచి తీస్తున్న మామిడి బ్రెడ్డు చెంప ముక్క

కాస్త మోసం కూసింత లౌక్యం కొన్ని గడులూ కొన్ని త్రికోణాలూ
కొన్ని పలుకులూ ఇన్ని కులుకులూ

అన్నీ వున్నాయి..
ఆకాశం క్రింద అన్నీ వున్నాయి మనచుట్టూ..
తుడుచుకుని తప్పించుకుని దులుపుకుని కలుపుకుని
కొత్త కొత్త దారుల్లో కొన్ని కొన్ని గోడుగులతో
చెమటతో కొన్నిటికీ నెత్తురుతో కొన్నిటికీ రంగులద్దుతూ
వట్టిపోయిన ఆశల్ని వదిలెయ్యడం నేర్చుకుంటూ
కొట్టిపడేస్తూ కొట్టుకుపోతూ

పైకి నిలకడగా ఉంటూ లోన పరిగెట్టగలగడం
పెదవి కదల్చకుండా పీక నులమగలగడం
నెమలీకలతో విసురుతూనే
నేర్పుగా కలల్ని దొంగిలించగలగడం...

తెలిసిన అలల్లో తెలియని నురగల్లో
అవే విరుపునవ్వుల్లో అలాంటి విషపు పువ్వులతో
ఆడుకోక తప్పదూ ఆటవిడుపు నప్పదూ...

ఇవి ఏ బోర్డుమీదా రాయని పాఠాలు
ఏ బెత్తం భయానా నేర్చుకోని లెక్కలు
ఏ ఛాన్సునీ వదలని ముళ్లు
కన్నుమూతవరకూ కనిపించే నొప్పులు కనిపించని కవుకు దెబ్బలు
కొన్ని మింగినవీ ఇంకొన్ని మింగించినవీ అన్నీ
జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం

అన్నీ వున్నాయి
థ్యాంక్స్ చెప్పక తప్పదే... ★★★

## పాతబంగారం

### అగస్త్యప్రగడ హేమంత

పాత బంగారం
పాత కొత్తలన్నీ
కొనే వస్తువులకీ
చకచకా కదిలిపోయే
సంవత్సరాలకీనూ!
మనసుకి కాదు...
స్మృతులకి అసలే కాదు!
వాటిని బయటకి తీసిన
ప్రతిసారీ...
అరచేతుల్లో పెట్టుకుని
అపురూపంగా చూసుకుంటాం!
ఉన్నదే చాలన్న ఉత్సాహంతో
పాతబడినా, బాధపడం!
అనాసక్తిని అసలే ప్రదర్శించం!
ఎందుకంటే...
అది..హృదిలో మండిపడుతున్న
అంశం కనుక!
అంచేతనే, దానిపై మక్కువ
రోజురోజుకీ
ఎక్కువవుతుంటుంది కనుక!

★★★



## ప్రేమ

### బాల విశ్వేశ్వరరావు

కొందరికి శీతల చంద్ర కిరణం
కొందరికి గ్రీష్మఋతు మధ్యాహ్నచండ ప్రచండ
అత్యుష్ణ తీక్షణ సూర్యకిరణం
సఫల ప్రేమ వసంత ఋతు విలాసం
విఫల ప్రేమ గ్రీష్మ ఋతు విలాపం
భగ్నప్రేమ భగభగ మండే ఉష్ణ సిల
కరిగిపోయిన పగటికల
కనులలో కన్నీటి ఊటలు
అయోమయపు ఎడారులలో
లయమైన బ్రతుకు బాటలు

మనోలోకంలో మాయా ప్రకంపనలు
పుట్టించి...జీవిత వృక్షాన్ని ఛేదించే
రెండంచుల నిశిత కరవాలం ఈ ప్రేమ
కర్కోటక మహావిష మిశ్రిత సుధాకలశం ఈ ప్రేమ ..!!

★★★



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఆప్తులన్న వారలదృశ్యమైన పిదప
ఒంటరిగ రోజులు గడపుచుంటి నేను
ఎవరి జీవితమ్ములు వారివే యటంచు
తెలిసికొన్ననీదశ నిన్ను తలచుచుందు

ప్రాణమిత్రుడవీవు చరమసఖుడవు
ఆప్తుడవె కాని కన్నులకానవెపుడు
అర్థవంతమో లేక నిరర్థకమ్మో
తెలియనేరని స్థితి నన్ను నిలిపినావు

ఎవ్వరికి కనబడకపోయిననుగాని
ఒక్కరును నిన్ను కానలేకున్న గాని
ఎడదనెప్పుడు విడని స్నేహితుడవీవు
ఎదురు చూతురు నీకొరకెల్ల జనులు

వలయు వారలందరు నన్ను వదలినపుడు
శూన్యమున దృక్కు సారించి సొలసినపుడు
ఆంధ్యమందున తోచునహస్సు వోలె
ఎదకు చేరువై నిల్చు స్నేహితుడవీవు

బ్రతుకు తుదిలేనిదట్లు కన్పట్టుచుండు
అన్నియును శాశ్వతమె యనినట్టులుండు
ఇహము నిత్యమటంచునూహించుచుందు
తరలి వచ్చి నీవు తలుపు తట్టు వరకు

COMMENTS